క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



నిల్వ నీటిలో మందులు వేస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి: మండలంలోని లంజన్‌వీర గ్రామంలో వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం డోర్‌టుడోర్ యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో ప్లాస్టిక్ డబ్బాలు, టైర్లు, తదితర నిరుపయోగంగా ఉన్న వాటిలోని నిల్వ నీటిలో తయారైన లార్వాలను గుర్తించి టెమీఫాస్ మందులు వేశారు. దోమల వ్యాప్తి నివారించేందుకు నిల్వ నీరు ఉండకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈవో రవిదాస్, హెచ్ఏ భగవాన్‌దాస్, బ్రీడింగ్ చెక్కర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

వాంకిడి: మండల సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం జరగాల్సి ఉండగా వాయిదా వేశారు. సమావేశం నిర్వహించేందుకు సరిపడా కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. సమావేశం నిర్వహించే తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా పడటం వరుసగా ఇది రెండోసారి.

పంప్‌హౌస్ వద్ద నిరసన

ఆసిఫాబాద్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ బుధవారం భగీరథ కార్మికులు జిల్లా కేంద్రంలోని ఎవరెస్ట్ కంపెనీ ఇన్ టేక్ పంప్‌హౌస్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్మికుడు ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. 21న మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు నరేశ్, ఉపేందర్, లోకేష్ తదితరులు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తిర్యాణి: మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, మండల పరిషత్ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

అనాథాశ్రమానికి విరాళం



నీటి శుద్ధియంత్రం అందజేస్తున్న ఎస్సై

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో గల ఫ్రీ మెథడిస్ట్ అనాథాశ్రమానికి సామాజిక కార్యకర్త మాడిశెట్టి ప్రశాంత్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై కాటారపు సందీప్ దంపతులు నీటి శుద్ధీకరణ యంత్రం విరాళంగా అందజేశారు. అనాథాశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి మరో అవకాశం

కాగజ్‌నగర్‌రూరల్: ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై ఇప్పటివరకు డిగ్రీలో చేరని విద్యార్థులకు ప్రభుత్వం మరోసారి చివరి విడత అవకాశం కల్పించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం తెలిపారు. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు విద్యార్థులు దోస్త్‌లో నమోదు చేసుకొని డిగ్రీలో ప్రవేశాలు పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని కొత్తగూడ (చేడ్వాయి) గ్రామానికి చెందిన కేర్కరి రాణికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.20వేల చెక్కును కుటుంబ సభ్యులకు బుధవారం బీఆర్ఎస్ నాయకుడు చౌదరి బండన్న అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ సత్తన్న, సత్యనారాయణ ఉన్నారు.

రవాణా సౌకర్యం లేక ఇక్కట్లు

- వర్షాకాలంలో వంతెనలు లేక అవస్థలు పడుతున్న గర్భిణులు, వృద్ధులు
- ప్రైవేట్ వాహనాల్లో ఆస్పత్రులకు తరలింపు
- సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు



పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆటోలో ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

బెజ్జూర్: మండలంలోని మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం లేక ఆయా గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయాల్లో వృద్ధులు, గర్భిణులు, పిల్లలు అనేక అవస్థలు పడుతున్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు ఒర్రెలు ఉప్పొంగడం, వంతెనలు లేకపోవడంతో ఆస్పత్రి చేరే దారి లేక, అంబులెన్స్ వచ్చే మార్గం కనిపించక వారు పడే బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. కనీసం వర్షాలు లేని సమయంలోనైనా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ఒర్రెలు దాటాల్సిందే..

మండల కేంద్రానికి దాదాపు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న మండలంలోని సుస్మీర్, మొగవెల్లి గ్రామ పంచాయతీలకు రోడ్డు సౌకర్యం కరువైంది. కొన్నేళ్లుగా ఆయా గ్రామాల ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారు. వర్షాలు కురిస్తే గ్రామాలకు వెళ్లేందుకు మార్గం మధ్యలో ఉన్న రెండు ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో వాటిని దాటలేని పరిస్థితి నెలకొంది. వంతెనలు లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అత్యవసర సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాల్సిన దుస్థితి నెలకొంటుంది.

అటవీ అనుమతులు లేక బ్రేక్

మండలంలోని సోమిని, సుస్మీర్, మొగవెల్లి గ్రామ పంచాయతీల్లో దాదాపు 14 గ్రామాలు ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాల క్రితం బీటీ రోడ్డు నిర్మాణంతో పాటు ఒర్రెలపై హైలెవెల్ వంతెనలు నిర్మించాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇప్పటివరకు నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో పనులు ప్రారంభించలేదని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు.

రాజీనామాలు చేసినా.. కానరాని మార్పు

రవాణా సౌకర్యం మెరుగుపర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని గతేడాది కొంత మంది ప్రజాప్రతినిధులు తమ పదవులకు రాజీనామా చేశారు. రోడ్డు నిర్మాణంతో పాటు హైలెవెల్ వంతెనలు నిర్మించాలని అధికార పార్టీకి చెందిన ఏడుగురు ప్రజాప్రతినిధులు ముకుమ్మడిగా రాజీనామా చేశారు. దీంతో స్పందించిన జిల్లా యంత్రాంగం ఆరు నెలల్లో రోడ్డు, హైలెవెల్ వంతెనల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో ఆరుగురు ప్రజాప్రతినిధులు తమ రాజీనామా వెనక్కి తీసుకున్నారు. అయినా ఇప్పటికీ రవాణా సౌకర్యం కల్పించలేదు.

ఏటా తప్పని తిప్పలు..

కొన్ని రోజుల క్రితం వర్షం కారణంగా సుస్మీర్ ఒర్రె ఉప్పొంగి ప్రవహించగా ఇప్పలగుడ గ్రామానికి చెందిన ఆత్రం రోజా అనే గర్భిణీకి ఫిట్స్ రావడంతో అనేక అవస్థలు ఎదురయ్యాయి. అంబులెన్స్ గ్రామంలోకి రాలేని పరిస్థితి ఉండడంతో ఓ ఆటోలో గర్భిణీని తలాయి గ్రామం వైపు నుంచి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రెండేళ్ల క్రితం సోమిని గ్రామానికి చెందిన కొండ్ర విజయలక్ష్మి అనే గర్భిణీకి పురిటి నొప్పులు రాగా ఎడ్ల బండిపై ఒర్రె దాటే క్రమంలో ఎడ్లబండిలోనే పురుడు పోసుకుంది. గత ఏడాది మొగవెల్లి గ్రామానికి చెందిన గర్భిణీ సైతం ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో రోడ్డు మధ్యలోనే పురుడు పోసుకుంది. ఇలా ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆశాజనకంగా పత్తి



దహెగాంలో సాగవుతున్న పత్తి పంట

- పూత, కాత దశలో పంట
- గిట్టుబాటు ధరపై రైతుల ఆశలు

దహెగాం: గత రెండేళ్లుగా అన్నదాతలకు ఖరీఫ్ కాలం కలిసి రాలేదు. అతివృష్టి వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. భారీ వరదలు రావడంతో పంటలు నీట మునిగాయి. ఈ ఖరీఫ్ సీజన్ కలిసి వస్తుందని కోటి ఆశలతో రైతులు పంటలు సాగు చేశారు. ప్రస్తుతం పత్తి పంట ఆశాజనకంగానే ఉంది. దీంతో అప్పుల ఊబిలో నుంచి బయట పడతామన్న ధీమాతో రైతులు ఉన్నారు. పత్తి పూత, కాత దశల్లో ఉంది. పెరుగుదల కూడా ఉండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

24 వేల ఎకరాల్లో సాగు..

మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 24వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. మండలంలో ప్రధానంగా పత్తి సాగు చేస్తుండగా తరువాతి స్థానంలో వరి సాగు ఉంది. ప్రస్తుతం పత్తి పూత దశలో ఉంది. ఖరీఫ్ ఆరంభంలో వర్షాలు సరైన సమయంలో కురువక రైతులు ఆందోళన చెందారు. అనంతరం జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు సమృద్ధిగా కురిశాయి. వాతావరణం అనుకూలిస్తుండడంతో ప్రస్తుతం పత్తికి తెగుళ్ల బెడద ఎక్కువగా లేదని రైతులు పేర్కొంటున్నారు. అయితే పూత, కాత దశలో ఉన్నందున గులాబీ రంగు పురుగు సోకే ప్రమాదం ఉంటుందంటున్నారు. గత సంవత్సరం పత్తికి క్వింటాల్‌కు రూ.7వేల నుంచి రూ. 9వేల వరకు మాత్రమే ధర పలకడంతో రూ. 10 వేల వరకు ధర వస్తుందని రైతులు ఇళ్లల్లో పెద్ద ఎత్తున పత్తి నిల్వ చేసుకున్నారు. అయినా గిట్టుబాటు ధర రాక తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాదైనా గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

యూరియా తగ్గించాలి



పత్తి పంట ప్రస్తుతం బాగానే ఉంది. పత్తి పూత దశలో ఉన్నందున యూరియా వేయకూడదు. కాత వచ్చిన సమయంలో పొటాష్ వేసుకోవాలి. గులాబి రంగు పురుగు నివారణకు హిమామెట్టిన్, బెంజోఏట్ అనే మందును 3 లేదా 4 ఎంఎల్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. సలహాలు, సూచనల కోసం సంబంధిత ఏఈవోలను సంప్రదించాలి.

– వంశీక్రిష్ణ, ఏవో

కొనసాగుతున్న సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె



సమ్మె చేస్తున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్: తమ డిమాండ్లను నెరవేర్చాలని సమగ్రశిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె బుధవారం 24వ రోజు కలెక్టరేట్ ఎదుట కొనసాగింది. సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ తమకు స్కేల్ అమలు, జీవిత బీమా, ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. సంతోష్, రమేశ్, మోహన్, సందీప్, మహేష్, నగేశ్, రవి, స్వప్న, మమత, తిరుమల, యూటీఎఫ్ సంఘం జిల్లా నాయకులు హేమంత్, ఊశన్న, ఇందులాల్ ఉన్నారు.

సీనియర్ మేట్‌లను ఎఫ్ఏలుగా నియమించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న మేట్‌లు

వాంకిడి: ఉపాధిహామీ పథకంలో సీనియర్ మేట్‌లను ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా నియమించాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలో నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు ఇప్పటివరకు ఫీల్డ్ అసిస్టెంట్‌ల నియామకం జరగలేదన్నారు. ఉపాధిహామీ పనుల్లో ఎఫ్ఏలతో సమానంగా పని చేస్తున్న తమను ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా నియమించాలని కోరారు. సీనియర్ మేట్‌లు సందీప్, రాజ్‌కుమార్, శ్రీరామ్, ప్రవీణ్ కుమార్, సోనేరావు, హరిదాస్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.30
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	60
కాకరకాయ	80
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	60
పచ్చిమిర్చి	80
పాలకూర	40
సోరకాయ	40
చిక్కుడు కాయ	60
గోబి(పూల్)	40
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్

తాళాలు పగులగొట్టి.. కేంద్రాలు తెరిచి



కెరమెరిలో అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగులగొడుతున్న సిబ్బంది

కెరమెరి: అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెతో మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాలను అధికారులు తెరిచారు. ఈ మేరకు బుధవారం తాళాలు పగులగొట్టి కేంద్రాలను తెరిచారు. మండలంలోని నాలుగు కస్టర్ల పరిధిలో ఉన్న కెరమెరిలోని 1, 2, దేవాపూర్, అంతాపూర్, ఆంద్‌గూడ, బొగడాగూడ, లక్మాపూర్, తుమ్మగూడ, నిషాని, ఇందాపూర్, దేవుడ్‌పల్లి, భీమన్‌గొంది, ధనోరా తదితర కేంద్రాలను తెరిచినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కుమారి, లత తెలిపారు. అంగనవాడీల కొనసాగింపు బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించినట్లు సూపర్‌వైజర్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీలు సమ్మె విరమించే వరకు అవసరమున్న చోట ఐకేపీ వీవోఏల ద్వారా కేంద్రాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు విలాస్, భీమయ్య, బొజ్జిరావు, ఐకేపీ సీసీలు జీవన్, శంకర్ తదితరులు ఉన్నారు.

నేడు 'గృహలక్ష్మి' పత్రాలు అందజేత

కౌటాల: మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీలు పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ తెలిపారు. నేడు ఉదయం 10 గంటలకు కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే కోనేరు కోనప్పల ఆధ్వర్యంలో మొదటి విడత పంపిణీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు సకాలంలో కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

కేసీఆర్ సేవాదళం కమిటీలో చోటు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ భవనంలో బుధవారం కేసీఆర్ సేవాదళం నూతన రాష్ట్ర కమిటీని వ్యవస్థాపక అధ్యక్షులు అమీర్, శ్రీనివాస్‌రెడ్డిల అధ్యక్షతన నియమించారు. జిల్లా కేంద్రానికి చెందిన ఉబెద్ బిన్ యాహియా (తిరీఫ్)ను రాష్ట్ర సెక్రటరీగా నియమించారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

జైనూర్: జైనూర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా జాదవ్ మధుకర్ బుధవారం బాధ్యతలు తీసుకోగా పీఆర్‌టీయూ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు జాదవ్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి



వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

కౌటాల: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కాంట్రాక్ట్ అధ్యాపకులు బుధవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ రెగ్యులర్ చేయకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆంజనేయులు, రాము, రజిత, రవీందర్, సమత, రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

కౌటాలకు చెందిన జాడి నితిన్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నితిన్‌ను శాలువతో సన్మానించారు. విద్యార్థి చదువుకు అండగా ఉంటామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కత్తెర్ల ఆత్మరాం అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీలు విశ్వనాథ్, నానయ్య, పార్టీ మండలాధ్యక్షుడు వసంత్‌రావు, ఉపసర్పంచ్ తిరుపతి, నాయకులు మధుకర్, రవీందర్‌గౌడ్, గట్టయ్య, గోపాల్, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల వినతి



వాంకిడి: వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



కెరమెరిలో..

వాంకిడి: న్యాయపరమైన డిమాండ్లతో సమ్మె చేస్తున్న తమను గుర్తించి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీలు బుధవారం ఎంపీపీ ముండె విమలబాయికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీని కోరారు.

కెరమెరిలో..

కెరమెరి: అంగన్‌వాడీలకు ఉన్న డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె బుధవారం పదో రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలు స్రవంతి, అనసూయ, గుణసుందరి, మంజూల, సావిత్రి, రాధ, చంద్రకళ, సరోజ, లూర్దుమేరి, అమలేశ్వరి, తాయిబాయి, హెల్పర్లు రజిత, సుమిత్ర, రేణుక, జనాబాయి, బూదేవి తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

జైనూర్: మండలంలోని ఆశేపల్లి గ్రామ పంచాయతీ పరిధి గ్రామాల్లో రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ యాదవ్ అన్నారు. ఈసందర్భంగా బుధవారం కమ్యూనిటీ షెడ్లు, సీసీ రహదారులు, మురికి కాలువలు, లింకు రోడ్లకు మరమ్మతు పనులకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు డీఎంఎస్‌టీ నిధుల్లో రూ. 10లక్షలు కేటాయించగా, పీఎంఏజీవై పథకంలో భాగంగా రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. సర్పంచ్ జాదవ్ దూరిబాయి, బీఆర్ఎస్ నాయకుడు మెస్రం అంబాజీ, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

270 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రైస్‌మిల్లులో సోదాలు నిర్వహిస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

రెబ్బెన: మండలంలోని దేవులగూడలో గల రైస్‌మిల్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని బుధవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ రమణారెడ్డి ఆదేశాల మేరకు విజిలెన్స్ డీఎస్పీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దేవులగూడలోని శ్రీ రాజరాజేశ్వరీ రైస్‌మిల్‌లో సోదాలు నిర్వహించారు. సోదాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 270 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించి కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో సీఐలు వరుణ్‌ప్రసాద్, అనిల్, ప్రశాంత్, తహసీల్దార్ దినేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలు జరుపుకోవాలి



యువకులతో మాట్లాడుతున్న ఎస్సై ప్రవీణ్

ఆసిఫాబాద్‌రూరల్: వినాయక ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్సై ప్రవీణ్ అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లారం గ్రామంలోని వినాయక మండపాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలన్నారు.

గిరిజన గ్రామాల్లో మెడికల్ క్యాంపులు

కాసిపేట: ఆదివాసీ గూడాల్లో జ్వరాల విజృంభణ.. తల్లడిల్లుతున్న గిరిజన గ్రామాలు అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. బుధవారం గిరిజన గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించారు. వైద్యాధికారి రవికిరణ్, ఎంపీడీవో ఎంఏ అలీం ఆధ్వర్యంలో మండలంలోని దేవాపూర్ నాయకపుగూడ, సోనాపూర్ దోడ్డిగూడ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగానే ఉన్నాయని, ఇళ్లల్లో మాత్రం శుభ్రంగా లేక వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై కేసు నమోదు

రెబ్బెన: మండలంలోని నంబాల శివారు సర్వే నంబర్ 190లో గల ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వ్యక్తులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ అల్లం నరేందర్, తిర్యాణి ఎస్సై రమేష్‌లు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం 190 సర్వేనంబర్‌లో గల 0.5 గుంటల ప్రభుత్వ భూమిలోకి నంది శంకరయ్య, నంది సాయికుమార్, నంది సతీశ్, గోలెం రమేశ్, గోలెం మంగలు ప్రవేశించి, భూమిలో ఉన్న ప్రభుత్వ బోర్డును సైతం ధ్వంసం చేశారు. దీంతో తహసీల్దార్ ఫిర్యాదు మేరకు 5గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఔట్ సోర్సింగ్ క్లర్క్‌ల నియామకాలు రద్దు చేయాలి

రెబ్బెన: సింగరేణి భవన్ ఫైనాన్స్, మార్కెటింగ్, పర్చేజ్ డిపార్టుమెంట్లలో పని చేసేందుకు యాజమాన్యం ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో క్లర్కుల నియామకాలు చేపట్టేందుకు తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి పేర్కొన్నారు. బుధవారం బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్‌తో పాటు ఖైరిగూడ మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్‌లకు వినతిపత్రాలు అందజేశారు. బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్యమొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన ఎస్సైగా చంద్రశేఖర్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: రెబ్బెన నూతన ఎస్సైగా డొలకాసి చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాగజ్‌నగర్ వన్‌టౌన్ ఎస్సైగా విధులు నిర్వహించిన చంద్రశేఖర్‌ను రెబ్బెన ఎస్సైగా బదిలీ చేశారు.

పొదుపు పథకాలు వినియోగించుకోవాలి

తాండూర్: గ్రామీణులు పోస్టాఫీసు పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి సబ్ డివిజన్‌పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సతీష్ సూచించారు. బుధవారం తాండూర్ పోస్టాఫీసులో జరిగిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పొదుపు చేయడం వల్ల ఆర్థిక భరోసా కలుగుతుందని పేర్కొన్నారు.